క్లుప్తంగా

నిత్యావసరాలు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని వీరాంజనేయనగర్‌లో నివశిస్తూ.. తోపుడు బండి తోలుకుంటూ జీవనోపాదికి ఇబ్బందులు పడుతున్న ఎస్.సాంబయ్య దంపతులకు ప్రజా చైతన్య భారతి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా చైతన్య భారతి అధ్యక్షుడు దూపగుంట్ల జానకి రామయ్య మాట్లాడుతూ ప్రతి నెలా రెండు సేవా కార్యక్రమాలకు తగ్గకుండా చేయాలని చెప్పగా సభ్యులందరు ఆ మేరకు తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సర్వేపల్లి సీతారామాంజనేయులు, పెద్దింటి వెంకటేశ్వర్లు, ప్రజా చైతన్య భారతి ఉపాధ్యక్షుడు పి.ఆంజనేయులు, కోశాధికారి మల్లేశ్వరావు, సెక్రటరీ కె.ప్రేమ్ కుమార్, నాసరయ్య, ప్రసాద్, పి.రామకోటయ్య, భవిరిశెట్టి సుబ్బారావు, చల్లా పెదమస్తాన్‌రావు, ఎ.ప్రభుదాస్, శ్రీరామ్ మూర్తి, హరిబాబు, పి.పెద్దన్న, రాంబాబు పాల్గొన్నారు.

నేడు సీఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం



నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు గన్నవరం నుంచి బుధవారం చేసే ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకించేందుకు పురపాలక సంఘం అధికారులు పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాలులో ప్రత్యక్షప్రసార ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు మంగళవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు టౌన్‌హాలులో చేసిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ప్రమాణస్వీకారం చూసేందుకు గన్నవరం వరకు రాలేని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూసేందుకు టౌన్‌హాలులో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయన వెంట నాయకులు కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు.

చౌక్ బాల్ విజేతలకు ప్రశంసా పత్రాలు



చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ చౌక్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో జలంధర్లో జరిగిన 14వ జూనియర్ చౌక్ బాల్ బాలబాలికల పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్, కార్యదర్శి ఎస్.సుధాకర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ప్రవీణ్ లు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రొంపిచర్ల: మండలం లోని పరగటిచర్ల, పాలపాడు గ్రామాల్లో మంగళవారం త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, త్రైత సిద్ధాంత సారాంశ అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆది కర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మ సంస్థాపన జరుగుతోందనీ, అదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. భగవద్గీత లోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలో 16,17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారమని వివరించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజలలో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక- చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, యద్దనపూడి రామాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పొట్లూరు పుల్లయ్య, స్వర్ణ, నరేంద్ర ప్రచారంలో పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: పట్టణ విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్ 2024లో సత్తా చాటారు. బైపీసీ విభాగంలో లింగంగుంట్లకు చెందిన చిటిమిటి సాయి జాహ్నవి 84వ ర్యాంకు సాధించింది. జాహ్నవి తండ్రి డాక్టర్ సాంబశివారెడ్డి ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి లక్ష్మి గృహిణి. జాహ్నవి నీట్ 2024 పరీక్షల్లో 705 మార్కులతో 1249 ర్యాంక్ సాధించింది. మంగళగిరి ఎయిమ్స్ కళాశాలలో మెడికల్ సీటు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేసింది. ఎంపీసీ విభాగంలో ప్రకాష్‌నగర్‌కు చెందిన విద్యార్థిని గోరంట్ల దివ్యలక్ష్మి 173వ ర్యాంక్ సాధించింది. తల్లిదండ్రులు మురళీకృష్ణ, ఉమామహేశ్వరి ఉపాధ్యాయులు.

తడబడితే తప్పదు మూల్యం

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ ఉంటేనే ముందుకెళ్లడం మంచిది



సత్తెనపల్లి: వేసవి సెలవులు ఈ రోజుతో ముగుస్తాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు మంచి విద్యాలయాల కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇదే సమయంలో పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయి. చాలా విద్యా సంస్థలు తమకు ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ లేకుండానే అడ్మిషన్ల పర్వానికి తెరతీశాయి. ఆకర్షణీయ బ్రోచర్లు, ప్రకటనలు, ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో తమ పిల్లల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దే బడి విషయంలో కొంత సమయం కేటాయించాలి. సదరు విద్యా సంస్థకు అన్ని అనుమతులు ఉన్నాయో.. లేదో.. మౌలిక సదుపాయాల కల్పన ఎలా ఉందో.. సరి చూసుకోవాలి. ఇంకాస్త సమయం కేటాయించి ఉపాధ్యాయుల పనితీరు కూడా తెలుసుకోవాలని విద్యా వేత్తలు సూచిస్తున్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేకుండానే తరగతులు

- జిల్లాలో దాదాపు 400కు పైగా ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి.
- పలు విద్యా సంస్థలు తమ బోర్డులపై రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ అని రాస్తున్నారు. కానీ వాటిలో కొన్ని ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకుండానే నడుస్తున్నాయి. కొన్ని యాజమాన్యాలు సీబీఎస్ఈ అనుమతులు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాయి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేట్ పాఠశాల ప్రారంభించాలంటే విద్యా శాఖ అనుమతి తీసుకోవాలి. మొదట ప్రారంభానికి అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరిచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి.
- ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యా శాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి.
- సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యా మండలి సమ్మతించాలి.
- కొన్ని విద్యా సంస్థలు మసిపూసి మారేడు కాయ చేస్తూ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పిల్లలను చేర్చుకుని ఏడాది చివరలో ఇతర విద్యా సంస్థల పేరున విద్యార్థులతో పరీక్షలు రాయించి మమ అనిపించేస్తున్నాయి.
- అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే తప్ప రెగ్యులర్ విద్యార్థిగా పరిగణించదు.
- అలాగే మరికొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బ్రాంచీల పేరుతో వేరే చోట పాఠశాలలు, కళాశాలలను నిర్వహిస్తూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచ్ ద్వారా పరీక్షలు రాయిస్తున్నాయి.
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి తమ పిల్లల్ని చేర్పించే విద్యా సంస్థ అనుమతి పత్రాలను ముందుగానే నిశితంగా పరిశీలించుకోవాలి.
- ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందే అంచనా వేసి తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలి.
- తల్లిదండ్రుల నిశిత పరిశీలన, ఆలోచనతో తీసుకునే నిర్ణయం వారి పిల్లల చదువుల అభ్యున్నతికి చక్కని పునాది పడేలా చేస్తోంది.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలనుకునే ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి గుర్తింపు ఉందో లేదో తెలుసుకున్న తర్వాతే అడ్మిషన్ పొందాలి.
- సదరు పాఠశాలలో మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం, గాలి, వెలుతురు సక్రమంగా ఇచ్చే భవనాలు ఎంతవరకు ఉన్నాయనే అంశాలను ముందస్తుగా పరిశీలించుకోవాలి.
- తమ పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చే వాహనాలు ఎలా ఉన్నాయి.. వాటిని పాఠశాల సమకూర్చుతుందా, బయట నుంచి మనమే ఏర్పాటు చేసుకోవాలా? అనే అంశాలపై ఆరా తీయాలి.
- ఒక్కో తరగతి గదిలో ఎంతమంది విద్యార్థులను కూర్చోబెడతారు? విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ నియామకాలు ఉన్నాయా లేదా? అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారా అన్న విషయాన్ని తెలుసుకోవాలి.
- జీ+1 భవనమైతే అగ్నిమాపక నిబంధనలు పాటిస్తున్నారా? అందుకు అవసరమైన యంత్ర పరికరాలు, సామాగ్రిని సిద్ధంగా ఉంచారో లేదో ఆరా తీయాలి.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు



కొత్త విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకునేందుకు నిఘా పెట్టాం. ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు అతిక్రమించే ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తాం. మళ్లీ గుర్తింపు పొందాలంటే వచ్చే ఏడాది వరకు ఆగాల్సిందే. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చే ముందు ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలను పరిశీలించుకున్న తర్వాతే అడ్మిషన్లు పొందాలి.

–ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా శాఖాధికారి, పల్నాడు.

సీఎం ప్రమాణ స్వీకార ప్రసారానికి ఏర్పాట్లు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఉదయం 11:27 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు మున్సిపల్ అధికారులు పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాట్లు చేశారు. ఎల్ఈడీ స్క్రీన్ పై వీక్షించేలా ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో పాటు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని కోరారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ



పిడుగురాళ్ల: అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ అన్నారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో శ్రీనివాస్‌రెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. అనుమతి లేని విత్తనాలను విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు. అదే విధంగా రైతులు విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదులు పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న కంభాల



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కంభాల వెంకటేశ్వరరావు మంగళవారం మొక్కు తీర్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి కన్నా లక్ష్మీనారాయణ అధిక మెజార్టీతో గెలవాలని, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే వడ్డవలి ఆంజనేయస్వామికి 101 కొబ్బరి కాయలు కొడతానని మొక్కు కున్నారు. ఫలితాలు అనంతరం కన్నా లక్ష్మీనారాయణ అధిక మెజారిటీతో గెలవడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా గుడిలో టీడీపీ నాయకులతో కలిసి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు చౌటా శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, పెద్ద కరిముల్లా, జాన్ బాబు, శిఖా కొండలు, స్వామి, భాష, తవిటి భవన్నారాయణ, పుష్ప,పెద్దింటి వెంకటేశ్వర్లు, కరేటి శ్రీను, బండారు నాగరాజు, సైదులు లోకేశ్వర రావు, మల్లెల నరసయ్య పాల్గొన్నారు.

సిమెంట్ లోడు లారీ బోల్తా



పిడుగురాళ్ల: సిమెంట్ లోడు లారీ బోల్తా పడిన ఘటన పట్టణంలోని బైపాస్ రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలపిన వివరాల ప్రకారం... పెదగార్లపాడు సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి తెనాలి వెళ్తుండగా మార్గంమధ్యలో పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్డు వద్ద ఉన్న బైపాస్ మూలమలుపు వద్దకు రాగానే డ్రైవర్ రుద్రయ్య మూలమలుపులో ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో సిమెంటు లోడు లారీ బోల్తా పడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

దోమల నివారణ చర్యలపై అవగాహన పెంచాలి

జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రరత్నాకర్

ముప్పాళ్ళ: దోమల నివారణకు ప్రతి ఆశ కార్యకర్త ఫ్రైడే కార్యక్రమంను ప్రజల్లోకి తీసుకెళ్లి అమలు జరిగేటట్లు చూడాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్రరత్నాకర్ కోరారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఇంటి ముందు మురుగు కాల్వల్లో చెత్తా చెదారం లేకుండా చూసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ముప్పాళ్ళలో వైద్య సిబ్బందితో కలిసి మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు వి.జయకృష్ణ ప్రవీణ్, ఆరోగ్య పర్యవేక్షకులు ఏ.పీటర్ డేమియన్, జోస్పిన్ రాణి, ఏఎన్ఎం ఎం.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కూలీలే కాపాడుకోవాలి



మస్టర్ తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

నాగవరం(క్రోసూరు): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానికి కూలీలు సన్నద్ధంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని నాగవరంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఆయన సందర్శించారు. కూలీలతో మాట్లాడారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం వల్ల పేద ప్రజలకు ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ పథకాన్ని కూలీలే కాపాడుకోవాలన్నారు. గతంలో మోదీ అధికారంలోకి రాక ముందు వేసవి అలవెన్స్, మజ్జిగ, మంచినీరు, గడ్డపలుగు, పార, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, టెంట్‌లు ఉండేవని అనంతరం వాటిని తీసేశారని చెప్పారు. పథకానికి బడ్జెట్లో కూడా నిధులు క్రమక్రమంగా తగ్గించుకుంటూ వస్తుంటే సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేయటం వల్ల నిధులు సాధించుకోవడం జరిగిందన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎంపీడీఓ టి.వెంకటరమణ, ఏపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి మాస్టర్లను పరిశీలించారు. రైతు సంఘం మండల కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, ఉపాధి హామీ మేట్‌లు సయ్యద్ సైదా, వీరబాబు పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు అవగాహన

- నీటి నమూనాల సేకరణ
- ఇంటింటి సర్వే చేసిన ఆరోగ్య, ఆశ కార్యకర్తలు




రెంటచింతలలో కొళాయి నీటిని సేకరిస్తున్న జిల్లా జూనియర్ అనాలసిస్ట్ రామకోటేశ్వరరెడ్డి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు కాలనీలలో తాగు నీటి వనరులైన ఓవర్‌హెడ్ ట్యాంక్, పబ్లిక్ ట్యాప్స్, వాటర్ ప్లాంట్స్ నుంచి నీటి నమూనాలను సేకరించి ఆయా కాలనీలలో ఇంటింటి సర్వే చేపట్టినట్లు మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వడ్డెర బావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేసి మాట్లాడారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఆదేశాల మేరకు కాలనీలలో ప్రబలిన అతిసార వ్యాధి అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రోజు ఇంటింటి సర్వేను కచ్చితంగా చేయాలని సూచించారు. కలుషిత నీటిని తాగడం వలన అతిసార వస్తుందని కాలనీ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైడ్ కాల్వల్లో ఉన్న మంచినీటి పైపులైన్లు వెంటనే సైడ్ కాల్వకు పైభాగాన ఏర్పాటు చేయాలని.. అతిసార వ్యాధి వచ్చిన ప్రాంతాలలో శానిటేషన్ పనులను చేపట్టాలని స్థానిక గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. గుంటూరు జిల్లా రీజనల్ ల్యాబ్ జూనియర్ అనాలసిస్ట్ రామకోటేశ్వరరెడ్డి గ్రామంలోని పలు కాలనీలలోని తాగు నీటి వనరులైన ఓవర్‌హెడ్ ట్యాంక్, పబ్లిక్ ట్యాప్స్, వాటర్ ప్లాంట్స్ నుంచి నీటి నమూనాల (శ్యాంపిల్స్)ను సేకరించి రీజనల్ ల్యాబ్‌కు తీసుకువెళ్లారన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మ రావు, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




వడ్డెర బావి సెంటర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

ఘనంగా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



విశేష అలంకరణలో శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి



వార్షిక వేడుకలు నిర్వహిస్తున్న వేద పండితులు

నకరికల్లు: మండలంలోని నర్శింగపాడు గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి సహిత గంగా అన్నపూర్ణా సమేత శ్రీ మరకత లింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ 7వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రదక్షిణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం. చండీ పారాయణ, రుద్ర హోమం తదితర పూజలు చేశారు. అమ్మవారికి కుంకు మార్చనలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

దుక్కులకు ఇది అనుకూలమైన సమయం

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి



రెంటచింతల: పంట భూములలో దుక్కులు దున్నుకునేందుకు రైతులకు ఇది అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కురిసే వర్షాలను మండలంలోని వివిధ గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుక్కులను వాలుగా లోతుగా దున్నుకోవాలని లేని ఎడల వర్షపు నీటికి భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. వాలుకు అడ్డంగా దుక్కులు దున్నిన వ్యవసాయ భూమి ఎక్కువ తేమను కలిగే సామర్థ్యం ఉంటుందన్నారు. లోతుగా దుక్కులు దున్నిన భూమిలో పంట మొక్కల వేర్లు లోతుగా పాదుకుని వెళ్లడం వలన ఎక్కువ పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పొలాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలను సాగుచేయడం వలన చీడ పీడలు భూమిలో ఉంటాయని ఈ సమయంలో దుక్కులు దున్నడం వలన భూములలో ఉండే క్రిమి కీటకాలతోపాటు చీడపీడలు చనిపోతాయన్నారు. దుక్కి దున్నుకోవడం వలన అయ్యే ఖర్చు కన్నా దాని ద్వారా రైతుకు చేకూరే ప్రయోజనమే ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు.

రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలలో భాగంగా జీలుగలతో తమ వ్యవసాయ భూములను సారవంతం చేసుకోవాలని ఆయన సూచించారు. పచ్చిరొట్ట పంటను భూమిలో కలియదున్నిన సాగుభూమి వివిధ పోషకాలతో సమతుల్యత కలిగి ఉండి మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. జీలుగలు ఒక కేజీ రూ.44కు అందజేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వారి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఆయా గ్రామాల్లోని గ్రామ సేవకులను, రెంటచింతల మండల వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవం



మంచికల్లు దేవస్థానంలో పోలేరమ్మ



పోలేరమ్మ దేవస్థానం ముఖద్వారం

రెంటచింతల: మండలంలోని పలనాటి కోనసీమగా పేరు పొందిన మంచికల్లు గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు మంగళవారం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం, వివిధ రకాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహంతో మేళతాళాలతో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఈ వేడుకలలో పాల్గొని అమ్మవారి చల్లని దీవెనలు పొందాలని ఆయన కోరారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో అంటు వ్యాధులు దూరం



మాచర్ల రూరల్: పరిసరాల పరిశుభ్రత ద్వారానే అంటువ్యాధులను నివారించవచ్చునని డాక్టర అరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో మలేరియా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. గ్రామాలలోని మురుగు కాల్వల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వలన దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే అవకాశముందన్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాల్వలు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. వీటన్నింటికి మూలం పరిసరాల పరిశుభ్రతను మెరుగు పర్చుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకుని అంటువ్యాధులు నివారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు ఏవీ రావు, షేక్ బాషా, అసిస్టెంట్ మురళీధర్, బాలయ్య, శివ, శ్రీనివాస్, విజయ, ఆషా, పూజా తదితరులున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com